## ఆదర్శ మండలంగా రఘునాథ పాలెంను

# తీర్చిదిద్దుతాం

- రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, చేనేత జౌళి శాఖల మంత్రి తుమ్మల నాగేశ్వర రావు
- రైతులు లాభసాటి ఆయిల్ పామ్ పంట సాగు చేయాలి
- విద్య ద్వారానే మన పేదరికం దూరం అవుతుంది
- రఘునాథపాలెం మండలం పుతాని తండా, సూర్య తండాలలో నిర్మించిన గ్రామ పంచాయతీ భవనాలను ప్రారంభించిన మంత్రి తుమ్మల












**ఖమ్మం, నవభూమి బ్యూరో, జూన్ 26:** ఆదర్శంగా రఘునాథపాలెం మండలాన్ని తీర్చిదిద్దుతామని రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, చేనేత జౌళి శాఖల మంత్రి తుమ్మల నాగేశ్వర రావు అన్నారు. మంత్రి గురువారం నాడు రఘునాథపాలెం మండలం పుతాని తండాలో ఎస్టీ.ఎస్.డి.ఎఫ్. నిధులు 20 లక్షలతో, సూర్య తండాలో 20 లక్షలతో నిర్మించిన గ్రామ పంచాయతీ భవనాలను స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ డాక్టర్ పి. శ్రీజ తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి తుమ్మల నాగేశ్వర రావు మాట్లాడుతూ గ్రామ పంచాయతీ భవనం వరకు విద్యుత్ సరఫరా చేసేందుకు అవసరమైన విద్యుత్ పోల్స్ వేయాలని అన్నారు. జీపీ భవనానికి కాంపౌండ్ వాల్ ఏర్పాటు చేయాలని, స్టోర్ రూమ్ తొలగించి సమావేశ మందిరం గది విస్తీర్ణం పెంచాలని మంత్రి సూచించారు. జీపీ భవనంలో ఒక రూం ప్రత్యేకంగా రీడింగ్ రూం క్రింద కేటాయించాలని అన్నారు. రఘునాథపాలెం మండలం ఆదర్శ మండలంగా తీర్చిదిద్దుతామని, తండాలలో పూర్తి స్థాయిలో సిసి రోడ్లు నిర్మిస్తున్నామని, పొలాలకు వెళ్లేందుకు కనీసం మట్టి రోడ్లు అందుబాటులో ఉండేలా చూస్తామని అన్నారు. రైతులు లాభసాటి ఆయిల్ పామ్ పంట సాగు విస్తరించాలని, అంతర్ పంటల క్రింద కూరగాయలను సాగు చేయవచ్చని అన్నారు. రఘునాథపాలెం మండలంలో స్వామి నారాయణ విద్యా సంస్థ, సమీకృత గురుకులాల నిర్మాణం జరుగుతున్నాయని, అవసరమైతే గిరిజనులకు మరో పాఠశాల తీసుకొని వచ్చి పిల్లలందరు చదువుకునేలా చూస్తామని అన్నారు. మన కుటుంబంలో ఒక వ్యక్తి బాగా చదువుకొని బాగుపడితే మనం పేదరికం నుంచి బయటకు వస్తామని మంత్రి తెలిపారు. పిల్లలకు అవసరమైన విద్యా అవకాశాలను స్థానికంగా అందుబాటులో తీసుకుని వస్తున్నామని అన్నారు. మంచుకొండలో రైతు బజార్ ఏర్పాటు చేశామని, కూరగాయలు చెడిపోకుండా ఉండేందుకు అవసరమైతే ఏసి వాహనాలు సబ్సిడీపై అందించేందుకు ప్రణాళికలు రూపొందిస్తున్నామని అన్నారు. పెండింగ్ పనులను ఒక్కొక్కటిగా చేస్తున్నామని అన్నారు. 9 రోజులలో 9 వేల కోట్ల రూపాయలను రైతు భరోసా క్రింద రైతుల ఖాతాలో జమ చేశామని అన్నారు. కార్యక్రమంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ డాక్టర్ పి. శ్రీజ మాట్లాడుతూ మన గ్రామానికి రూపం గ్రామ పంచాయతీ భవనం అని, దీనిని పూర్తి చేసుకున్న గ్రామస్థులకు అభినందనలు తెలిపారు. గిరిజన ప్రాంతాల్లో గ్రామ పంచాయతీ భవనం పూర్తి స్థాయిలో వినియోగించుకోవాలని, ఇక్కడ ఒక గదిని గ్రంథాలయం లాగా ఏర్పాటు చేసుకోవాలని, అవసరమైన పుస్తకాలను అందుబాటులో పెట్టుకోవాలని అన్నారు. వానాకాలం వచ్చిన నేపథ్యంలో విష జ్వరాలు, సీజనల్ వ్యాధులు వ్యాప్తి జరగకుండా మన పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా మంత్రి పుతానితండా గ్రామంలో 9 మంది, సూర్య తండా గ్రామంలో 10 మంది ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులకు ఇండ్ల మంజూరు పత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు, ఖమ్మం మార్కెట్ కమిటీ చైర్మన్ హన్మంత రావు, జెడ్పీ సీఈఓ దీక్షా రైనా, డిపిఓ ఆశాలత, ఖమ్మం ఆర్డీఓ నరసింహా రావు, డివిజనల్ పంచాయతీ అధికారి రాంబాబు, రఘునాథపాలెం మండల తహసీల్దార్ శ్వేత, ఎంపిడివో అశోక్ కుమార్, ప్రజా ప్రతినిధులు, వివిధ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## ఎర్ర జెండాలన్నీ

# ఏకం కావాలి


# నవభూమి



## జిల్లా అనుబంధం

27 జూన్ ,2025 శుక్రవారం పేజీలు:6

www.epaper.navabhoomi.in


## ఇన్సూరెన్స్ - షోరూంల

# సిండికేట్ దందా

## మోసపోయిన వాహనదారుడు




**ఖమ్మం, నవభూమి జూన్ 26 :** ప్రమాదం జరిగితే ఇన్సూరెన్స్ ద్వారా ఆ కుటుంబానికి న్యాయం జరుగుతుందని వాహనం కొనుగోలు చేసే ప్రతి ఒక్కరూ ఆయా వాహనాల పేరు మీద ఇన్సూరెన్స్ చేయించుకోవడం ఆనవాయితీ. కానీ వాహనం కొనుగోలు చేసిన షోరూం ఇన్సూరెన్స్ కంపెనీ సిండికేట్ అయి వాహనదారులను మోసం చేస్తే వారి బాధ వర్ణనాతీతం. సూర్యాపేట జిల్లా నడిగూడెం మండలం వల్లపురం రావిచెట్టు గ్రామాని చెంది వ్యవసాయ కూలీ చేసుకునే కొప్పెర వెంకటేశ్వర్లు తన భార్య పేరు మీద టాటా మోటార్ కంపెనీకి చెందిన డీసీఎం వ్యాన్ ను ఖమ్మం నగరం శ్రీశ్రీ సర్కిల్లోని గీత షోరూంలో కొనుగోలు చేసి మూడు నెలల తర్వాత ప్రమాదం జరిగితే కొనుగోలు చేసిన షోరూం ఇన్సూరెన్స్ కంపెనీ సిండికేట్ అయి మోసం చేశాయని ఖమ్మం ప్రెస్ క్లబ్లో తన ఆవేదనను వ్యక్తం చేశాడు. గురువారం ఖమ్మం ప్రెస్క్లబ్లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో కొప్పెర వెంకటేశ్వర్లు మాట్లాడుతూ.. జూన్ 3, 2024న రూ.35 లక్షలకు ఖమ్మం లోని గీతా షో రూమ్ లో టాటా కంపెనీకి చెందిన డీసీఎం (టిజి 29టి0901) (మోడల్ 1916) ను రూ. 31.21 లక్షల ఎస్బిఐ జనరల్ ఇన్సూరెన్స్ తో కొనుగోలు చేశానని తెలిపాడు. 3 నెలల అనంతరం ఆంధ్రప్రదేశ్ ఒంగోలు దగ్గర సింగరాయకొండ పోలీస్ స్టేషన్ పరిధిలో ప్రమాదం జరిగితే సంబంధిత ఇన్సూరెన్స్ కంపెనీకి సమాచారం ఇచ్చి, ఖమ్మం గీతా షోరూం మహమ్మద్ అబ్జల్ అలీ తెలియజేశాను అన్నారు. ఒంగోలులోని ఎంజి బ్రదర్స్ షోరూమ్ కు వాహనాన్ని తరలించి దానిని బాగు చేయుటకు గీత షోరూం అబ్దుల్ అలీ ద్వారా రూ 1.35 లక్షల రూపాయలు కట్టించుకున్నారని ఆవేదన వ్యక్తం చేశాడు. 45 రోజులలో రిపేర్ చేయిస్తానని సుమారు పది నెలలు అక్కడే ఉంచుకొని ఇన్సూరెన్స్ డబ్బు క్లైమ్ చేసుకొని నన్ను ఇబ్బందులు గురి చేశారని వాపోయాడు. టాటా మోటార్ నిబంధనల ప్రకారం 90 రోజులో ఇవ్వాల్సిన బండిని ఇవ్వకుండా ఇబ్బంది పెట్టారన్నారు. ఒంగోలు నుండి ఖమ్మం గీత షోరూం కు డిసియం ను తీసుకొస్తే డబ్బులు కడితే బాగు చేస్తా లేకుంటే తీసుకెళ్లమన్నారని ఆవేదన వ్యక్తం చేశారు. నెలకు రూ. 51,500లు కడుతున్నా కానీ ఎస్బిఐ జనరల్ ఇన్సూరెన్స్, ఒంగోలు ఎంజి బ్రదర్స్ షోరూమ్, ఖమ్మం గీతా షోరూం సిండికేట్ అయ్యి తనకు తీవ్ర అన్యాయం చేశారని, మానసికంగా శారీరకంగా ఆర్థికంగా ఎంతో నష్టపోయానని తనకు న్యాయం చేయాలని వేడుకున్నాడు. ఈ విలేకరుల సమావేశంలో భార్య వరలక్ష్మి నాగయ్య బుద్ధి వెంకన్న నరేష్ పాల్గొన్నారు.

## రైతు భరోసా నిధుల జమ కావడం పట్ల

## మంత్రి తుమ్మలకి కృతజ్ఞతలు తెలిపిన రైతులు





**దమ్మపేట జూన్ 26 నవభూమి:** రాష్ట్ర ప్రభుత్వం రైతుల సంక్షేమం కోసం అమలు చేస్తున్న రైతు భరోసా పథకం ద్వారా నిధులు రైతుల ఖాతాల్లో జమ కావడంతో దమ్మపేట మండలానికి చెందిన రైతు నాయకులు గురువారం మంత్రి తుమ్మల నాగేశ్వరరావు కి కలిసి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా గురువారం గండుగులపల్లిలో మంత్రి నివాసానికి వచ్చిన రైతులు ఆయనకు శాలువతో సత్కరించారు. అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా రైతు నాయకులు మాట్లాడుతూ రాష్ట్రంలో వ్యవసాయ శాఖకు తుమ్మల నాగేశ్వరరావు మంత్రి కావడం ఎంతో ఆనందకరమని ఆయన అనుభవం, విజ్ఞానంతో వ్యవసాయ రంగం మరింత అభివృద్ధి చెందుతోందిని ఆశాభావం వ్యక్తం చేశారు. రైతులను అర్థం చేసుకునే నేతగా ఆయన నిలుస్తున్నారని పేర్కొన్నారు. రైతులకు మద్దతుగా, వారి భవిష్యత్తు కోసం ఎల్లప్పుడూ అంకితభావంతో పనిచేస్తున్న మంత్రి తుమ్మల అద్భుతంగా పనిచేస్తున్నారని రైతులు ప్రశంసించారు. ఈ సందర్భంగా మంత్రి రైతులతో మాట్లాడుతూ రైతు సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమనీ, ప్రతీ రైతు ఇంటిలో ఆనందం నింపుతున్నామని, ప్రభుత్వం అందించే ప్రతి పథకం ఫలితంగా రైతులకు ఉపయోగం కలగాలన్నదే ప్రభుత్వ లక్ష్యమని ఆయన అన్నారు.

# మంత్రులను కలిసిన టీపీసీసీ ప్రధాన కార్యదర్శి నాగా సీతారాములు





**రుద్రంపూర్ జూన్ 26 నవభూమి:** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా టీపీసీసీ ప్రధాన కార్యదర్శిగా గాంధీభవన్‌లో నియామకపత్రం అందుకున్న అనంతరం నాగా సీతారాములు రోడ్లు, భవనాల శాఖామంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి, రాష్ట్ర రవాణా మరియు బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ గౌడ్, తెలంగాణ రాష్ట్ర పశుసంవర్ధక, పాడి పరిశ్రమ అభివృద్ధి, మత్స్య సంపద, క్రీడలు యువజన సేవల మంత్రి వాకాటి శ్రీహరిలను వారి క్యాంపు కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వారు నాగా సీతారాములుకు శుభాకాంక్షలు తెలిపి అభినందించారు. కార్యకర్తల అభిష్టాన్ని పరిగణలోకి తీసుకుని, పార్టీ కోసం కష్టపడ్డ వారిని అధిష్టానం గుర్తించి మంచి హోదా కల్పిస్తుందన్నారు. ఇందిరమ్మ రాజ్యంలో ప్రజాప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లి రాబోయే ఎన్నికల్లో సత్తా చాటాలన్నారు.

# అశ్వాపురం సిఐ అశోక్ రెడ్డి ఆధ్వర్యంలో మాదక ద్రవ్యాలకు వ్యతిరేకంగా పోలీసుల భారీ ర్యాలీ





**అశ్వాపురం జూన్ 26 నవభూమి:** అశ్వాపురం మండల కేంద్రంలో అంతర్జాతీయ మాదక ద్రవ్యాల నిరోధక దినోత్సవం సందర్భంగా గురువారం అశ్వాపురం పోలీస్ స్టేషన్ నుంచి జగదాంబ సెంటర్ మీదుగా బస్టాండ్ సెంటర్ వరకూ పోలీసులు, ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులు భారీ ర్యాలీ నిర్వహించారు.

ఈ సందర్భంగా బస్టాండ్ సెంటర్ వద్ద మానవహారం నిర్వహించి సిఐ అశోక్ రెడ్డి విద్యార్థుల చేత ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం సిఐ అశోక్ రెడ్డి మాట్లాడుతూ.. మాదక ద్రవ్యాలకు యువత, విద్యార్థులు దూరంగా ఉండాలన్నారు. ఆరోగ్యకరమైన సమాజ స్థాపనకు యువత కృషి చేయాలన్నారు. యువత మత్తు పదార్థాలు సేవించి మానసికంగా, శారీకంగా జీవితాలను నాశనం చేసుకుంటున్నారన్నారు. మాదక ద్రవ్యాలు వినియోగించినా, రవాణా సాగించినా చట్టరీత్యా నేరమన్నారు. యువత భవిష్యత్ లక్ష్యాన్ని ఏర్పాటు చేసుకుని సాధించే వరకు శ్రమించాలన్నారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ జూనియర్ కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు కాంగ్రెస్ పార్టీ నాయకులు గాదె కేశవరెడ్డి, కోలా శశికాంత్, తదితరులు పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు

# మాదకద్రవ్యాలను అరికట్టడంలో ప్రతి ఒక్కరు కృషి చేయాలి

## ఏసీపీ తిరుపతిరెడ్డి




**తిరుమలాయపాలెం నవభూమి జూన్ 26:** మాదకద్రవ్యాలను అరికట్టడంలో ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఖమ్మం రూరల్ ఏసీపి తిరుపతిరెడ్డి అన్నారు గురువారం మాదక దవ్యాల వ్యతిరేక దినోత్సవం సందర్భంగా ర్యాలీని ప్రారంభించారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాలలో యువతి యువకులు మాదక ద్రవ్యాలకు అలవాటు పార్టీ ఎంతో నష్టపోతున్నారని ఆయన గుర్తు చేశారు ప్రతి ఒక్కరూ వీటిని అరికట్టడంలో కీలక పాత్ర పోషించాలని సూచించారు మాదాక ద్రవ్యాల వాడటం వలన కుటుంబం జీవితం అస్తవ్యస్తంగా మారే అవకాశం ఉందని అన్నారు ఈ కార్యక్రమంలో కూసుమంచి సీఐ తిరుమలాయపాలెం ఎస్ఐ కూచిపూడి జగదీష్ ఎస్సై రామలింగారెడ్డి సిబ్బంది వీరస్వామి వెంకటేష్ రాజు సర్దార్ సింగ్ తదితరులు పాల్గొన్నారు.

# సీతారామ ప్రాజెక్టు సత్వరమే పాలేరు రిజర్వాయర్‌కు అనుసంధానం చేయాలి

## తెలంగాణ రైతు సంఘం జిల్లా కార్యదర్శి బొంతు రాంబాబు డిమాండ్



**ఏన్కూరు నవభూమి జూన్ 26 :** సీతారామ ప్రాజెక్ట్ సత్వరమే పూర్తి చేసి పాలేరు రిజర్వాయర్ కు అనుసంధానం చేయాలని తెలంగాణ రైతు సంఘం జిల్లా కార్యదర్శి బొంతు రాంబాబు డిమాండ్ చేశారు. గురువారం తెలంగాణ రైతు సంఘం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో రైతు బృందం సీతారామ ప్రాజెక్ట్ ప్రధాన కెనాల్ తోపాటు వైరా రిజర్వాయర్ రాజీవ్ లింక్ కెనాల్ , నాగార్జునసాగర్ తిమ్మరావుపేట ఎడ్ రెగ్యులేటర్, వైరా రిజర్వాయర్ ఎస్కేప్ ఛానల్ పరిశీలన చేశారు. ఈ సందర్భంగా తెలంగాణ రైతు సంఘం జిల్లా కార్యదర్శి బొంతు రాంబాబు మాట్లాడుతూ సీతారామ ప్రాజెక్ట్ ప్రధాన కెనాల్ పనులు 2023 డిసెంబర్ నుంచి ఒక్క అంగుళం కెనాల్ త్రవ్వలేదు తట మట్టి తీయలేదు అన్నారు. 2003 లోనే గోదావరి జలాలు సాధన కోసం ఖమ్మం మాజీ పార్లమెంటు సభ్యుడు తమ్మినేని వీరభద్రం మహా ప్రస్థానం పాదయాత్ర నిర్వహించారు అని గుర్తు చేశారు. 2005 డిసెంబర్ 31 నాటి ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి గోదావరి మీద ప్రాజెక్ట్ నిర్మాణం కోసం శంకుస్థాపన చేసినప్పటికీ ఐదుగురు ముఖ్యమంత్రులు వచ్చిన దుమ్ముగూడెం ప్రాజెక్ట్ పూర్తి చేయలేదు అన్నారు.డిజైన్ , పేర్లు, ఎస్టిమేషనస్ మార్చడం తప్ప పాలేరు రిజర్వాయర్ అనుసంధానం రైతులు కోరిక కలగానే మిగిలిపోయింది అన్నారు. వైరా రిజర్వాయర్ అనుసంధానం రాజీవ్ లింక్ కెనాల్ కూడా అశాస్త్రీయం గా ఉందని తెలిపారు. సీతారామ ప్రాజెక్ట్ సత్వరమే పూర్తి చేయాలి అని డిమాండ్ చేశారు. ప్రాజెక్టు పూర్తి చేయుటకు 19900 కోట్ల రూపాయలు అవసరం ఉందని రాష్ట్ర నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి సమక్షంలో అంచనాలు రూపొందించి కేవలం 664 కోట్ల రూపాయలు మాత్రమే ఈ బడ్జెట్లో కేటాయింపులు చేశారని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రాధాన్యత క్రమంలో సీతారామ ప్రాజెక్ట్ సత్వరమే పూర్తి చేయుటకు జిల్లా లో ఉన్న ముగ్గురు మంత్రులు భాధ్యత తీసుకొవాలని కోరారు. ప్రభుత్వం స్పందించకపోతే రైతులను కదిలించి ఉద్యమం చేస్తామని హెచ్చరించారు.

తెలంగాణ రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు మాదినేని రమేష్ మాట్లాడుతూ సీతారామ ప్రాజెక్టు నిర్మాణం కోసం ఏన్కూరు, కామేపల్లి మండలాల్లో భూ సేకరణ అవార్డు 2019 ప్రభుత్వం ప్రకటించి రైతులకు పరిహారం అందించలేదని , కాలువలు నిర్మాణం చేయడం లేదని అన్నారు.రాజీవ్ లింక్ కెనాల్ భూ నిర్వాసితుల పరిహారం అందని రైతులకు పరిహారం తోపాటు భూములు కోల్పోయిన రైతులు కాలువల కింద భూమి పోను అదే సర్వ నెంబరు లో ఉన్న భూమి కి భోరసా అందించాలి అని తెలిపారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు దుగ్గి కృష్ణ, ఎస్ కె మీరా, సహాయ కార్యదర్శులు చింత నిప్పు చలపతిరావు, బిక్కసాని గంగాధర్, మల్లెల సన్మధరావు, దొంతి బోయిన నాగేశ్వరరావు, భూక్యా లక్ష్మా, అంబటి శ్రీనివాస రెడ్డి, దొండపాట్టి నాగేశ్వరరావు, తూళ్లూరు రమేష్, తోటకూర రాజు, దొడ్డపనేని కృష్ణార్జున్ రావు, శీలం సత్యనారాయణ రెడ్డి, కొమ్మినేని నాగేశ్వరరావు, సంక్రాంతి పురుషోత్తం, గుండా సత్యనారాయణ రెడ్డి,ఇంజం వేణు, నండూరి శ్రీనివాసరావు, బదావత్ శ్రీనివాసరావు, కందిబడ్ల శ్రీనివాసరావు,వజ్జా రామారావు తదితరులు పాల్గొన్నారు.

# అంజమ్మకు నివాళులర్పించిన నరేష్ రెడ్డి



**తిరుమలాయపాలెం నవభూమి జూన్ 26:**సుబ్లేడ్ గ్రామ మాజీ ఉపసర్పంచ్ బత్తుల వెంకటనారాయణ తల్లి అంజమ్మ ప్రథమ వర్ధంతి సందర్భంగా ఆమె విగ్రహానికి పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు రామసహాయం నరేష్ రెడ్డి ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అంజమ్మ మరణించి సంవత్సరం అవుతున్న ఆమె సేవలు మిగిలి ఉన్నాయని ఆమె చేసిన సేవలను ఆయన గుర్తు చేశారు వారి ఆశయ సాధన కోసం ప్రతి ఒక్కరూ విచ్చేయాలని తీర్పునిచ్చారు ఈ కార్యక్రమంలో ఆత్మ కమిటీ డైరెక్టర్ ఘోర వెంకటేశ్వర్లు కాంగ్రెస్ పార్టీ నాయకులు సుమన్ రెడ్డి గంధం సిరి వీరన్న గంగ సిరి నాగయ్య పిచ్చయ్య మెట్టు మధు అనిల్ తదితరులు పాల్గొన్నారు

# మణుగూరులో ఓసి విస్తరణ కోసం ప్రజాభిప్రాయ సేకరణ





**మణుగూరు జూన్ 26 నవభూమి ప్రతినిధి:** మణుగూరు ఓసి విస్తరణలో భాగంగా గురువారం మణుగూరు రెవిన్యూ గ్రామం భూసేకరణ కొరకు మణుగూరు కొమ్ముగూడెం కమ్యూనిటీ హాల్ నందు గ్రామ పెద్ద కంగాల భిక్షం అధ్యక్షతన గ్రామ సభ్యులు సున్నం మంగయ్య, చందా నాగేష్ మరియు స్పెషల్ డిప్యూటీ కలెక్టర్, (భూసేకరణ), యూనిట్ -2 పాల్వంచ ఆధ్వర్యంలో గ్రామసభ ఏర్పాటు చేయడం జరిగింది. ఇట్టి సమావేశం నందు స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ టి. సుమ మణుగూరు ఓసి విస్తరణ భూసేకరణ ఆవశ్యకత, ప్రజాపయోగం గురించి గ్రామస్తులకు వివరించడం జరిగింది. ఈ ఓసి విస్తరణలో భూమి కోల్పోతున్న నిర్వాసితులకు ఎకరానికి రూ. 22,50000 లు నష్టపరిహారం ఇస్తామని, అదేవిధంగా ఆర్ ఆర్ ప్యాకేజ్ 5.5 లక్షలు, గవర్నమెంట్ భూమిలో ఉన్న గిరిజనులకు పూర్తీ ప్యాకేజ్, గిరిజనేతలకు రూ. 11లక్షల 25 వేలు ఇస్తామని తెలియజేశారు. అర్హులైన భూనిర్వాసీత కుటుంబాలలో ఉన్న నిరుద్యోగులకు కనీష వేతనం తగ్గకుండా వారికి స్కిల్ డెవలప్మెంట్ ట్రైనింగ్ ఇచ్చి ఓసి లో ఉపాధి కల్పిస్తారని తెలియజేసారు. అదేవిధంగా అట్టి భూమిపై ఏమైనా చెట్లు, బోరు, బావి, కట్టడాలు ఏమైనా ఉంటే సంబంధిత డిపార్ట్మెంట్ నుండి వాల్యుయేషన్ తెప్పించి అదనంగా ఇవ్వడం జరుగుతుంది. అదేవిధంగా చెరువుపై ఆధారపడిన అర్హులైన మత్యాకారులకు కూడా ఆర్ ఆర్ ప్యాకేజ్ క్రింద రూ. 5.5 లక్షలు ఇస్తామని తెలియజేశారు. ఐటీయి విషయాలను గ్రామ పెద్దలు, గ్రామస్తులు క్షుణంగా ఎస్ డి సి చెప్పిన విషయాలను విన్న వెంటనే ఓ సి విస్తరణకు మా భూములు ఇచ్చుటకు మేము పూర్తీ స్థాయిలో అంగీకరిస్తున్నాము అని అందరూ చేతులెత్తి సభాముఖంగా ఆమోదం తెలియజేస్తూ సంతకాలు చేసినారు. ఇట్టి గ్రామ సభ నందు మణుగూరు మున్సిపల్ కమిషనర్, తహసీల్దార్ నరేష్, ఎంపీడీఓ మణుగూరు, సింగరేణి అధికారులు, సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

## పాఠశాల సందర్శించిన కాంప్లెక్స్ హెచ్ఎం హరిత





**అశ్వారావుపేట టౌన్ జూన్ 26 నవభూమి:** అశ్వారావుపేట ప్రాథమిక పాఠశాలను కాంప్లెక్సు ప్రధానోపాధ్యయురాలు పి హరిత ఆకస్మికంగా సందర్శించారు. విద్యార్థుల సామర్ధ్యాలను, హాజరును రికార్డులు పరిశీలించారు. యుడైస్ లో ప్రతీ విద్యార్థి ఉండేలా చూసుకోవాలని, ఫేస్ రికగ్నిషన్ యాప్ ద్వారా ప్రతి విద్యార్థి హాజరును 10 గంటల లోపుగా నమోదు చేయాలని అన్నారు. మధ్యాహ్నభోజన హాజరును కూడా యాప్ లో నమోదు చేయాలని అన్నారు. మధ్యాహ్నభోజనాన్ని పరిశీలించి మెనూ ప్రకారం విద్యార్థులకు భోజనం అందించాలని వంట ఏజన్సీ వారికి తెలిపారు. అనంతరం విద్యార్థులకు నోట్ బుక్స్, వర్క్ బుక్స్ ను పంపిణీ చేసారు. వీరితోపాటు సి.ఆర్.పి ప్రభాకరాచార్యులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు బి.వి.సత్యనారాయణ, లీలావతి, శారద పాల్గొన్నారు.

## ప్రైవేట్ పాఠశాల యాజమాన్యాలతో ఎంఈఓ సమావేశం





**అశ్వాపురం జూన్ 26 నవభూమి:** అశ్వాపురం మండలం ప్రైవేటు పాఠశాలలో కనీస మౌలిక వసతులు ఉండేలా చూసుకోవాలని గురువారం మండల విద్యాశాఖ అధికారి వీరస్వామి అన్నారు. ఈ సందర్భంగా అశ్వాపురంలోని మండల విద్యా వనరుల కార్యాలయంలో ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాలతో సమావేశం నిర్వహించారు. పాఠశాలలో బోధించే ఉపాధ్యాయుల సివిల్ లిస్ట్, ఫీజు పట్టిక, ప్లేగ్రౌండ్, తరగతి గదులు పరిశుభ్రత తదితర అంశాలపై సమావేశం నిర్వహించి ప్రతి నెల కచ్చితంగా పాఠశాలల సందర్శన ఉంటుందని అన్నారు. నూతనంగా విద్యార్థుల చేరికలు, తొలగింపు తదితర అంశాలపై ఖచ్చితమైన అవగాహన ఉండాలని అన్నారు. ఈ కార్యక్రమంలో మండల లోని ప్రైవేటు పాఠశాల యాజమాన్యాలు తదితరులు పాల్గొన్నారు.

## తాసిల్దారు మణీధర్‌ని మర్యాదపూర్వకంగా కలిసిన దోసపాటి



**అశ్వాపురం జూన్ 26 నవభూమి:** అశ్వాపురం మండల తాసిల్దార్ మణిధర్ ని గురువారం మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్చం జ్ఞాపికను అందజేసి శుభాకాంక్షలు తెలియజేసిన శివ కామేశ్వరి గ్రూప్ డైరెక్టర్ దోసపాటి పిచ్చేశ్వరరావు

## పలు కుటుంబాలను పరామర్శించిన మాజీ ఎమ్మెల్యే రేగా







**అశ్వాపురం జూన్ 26 నవభూమి:** అశ్వాపురం మండలం మొండికుంట గ్రామంలో గురువారం బిఆర్ఎస్ పార్టీ యువజన నాయకుడు ఎండి జావీద్ మాతృమూర్తి ఎండి రైమున్నిసా భేగం అనారోగ్యంతో మరణించారని విషయాన్ని తెలుసుకొని వారి స్వగ్రామునకు వెళ్లి వారి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించి కుటుంబ సభ్యులను పరామర్శించినారు. మొండికుంట ఎస్ టి కాలని నివాసి పరిస్కా భద్రమ్మ అనారోగ్యంతో మరణించారనే విషయాన్ని తెలుసుకొని వారి స్వగృహమునకు వెళ్లి వారి చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించి కుటుంబ సభ్యులకు ఆర్థిక సహాయం అందజేసినారు. అనంతరం మల్లెల మడుగు గ్రామ నివాసి సురకంటి వెంకటరమణా రెడ్డి అనారోగ్యంతో మరణించారని విషయాన్ని తెలుసుకొని వారి స్వగ్రామునకు వెళ్లి వారి చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించి కుటుంబ సభ్యుల్ని పరామర్శించిన భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అధ్యక్షుడు, పినపాక మాజీ శాసనసభ్యులు రేగా కాంతారావు. ఈ కార్యక్రమంలో మండల బి ఆర్ ఎస్ పార్టీ అధ్యక్షుడు కోడి అమరేందర్ యాదవ్, మాజీ ఎంపీపీ కొల్లు మల్లారెడ్డి, మండల బి ఆర్ ఎస్ పార్టీ ప్రధాన కార్యదర్శి మర్రి మల్లారెడ్డి, జాలే రామకృష్ణారెడ్డి, నియోజకవర్గం ఎస్సీ సెల్ అధ్యక్షుడు వెన్న అశోక్ కుమార్, సూదిరెడ్డి గోపిరెడ్డి, మేడవరపు సుధీర్, చిలక వెంకటరామయ్య, మొగిళ్ల వీరారెడ్డి, గొర్రెముచ్చు వెంకటరమణ, పాటి మన్మధ రెడ్డి (మొండికుంట గ్రామ శాఖ అధ్యక్షులు), టేకుల సురేష్ రెడ్డి, మిట్టకంటి వెంకటరెడ్డి, మంద్రు రామకృష్ణ, తూము రాఘవులు, మామిడి శ్రీను, ముత్యాల నరసింహారావు, మంగళగిరి రామకృష్ణ,చల్లా రాజు,ఈసంపల్లి పున్నారావు, కడారి వేణు, నజీర్ సోను, వాళ్లపోగు రాము, శివారపు డాక్టర్ బాబు, మండల సోషల్ మీడియా అధ్యక్షుడు గజ్జి లోహిత్ యాదవ్, తదితర యువజన నాయకులు పాల్గొన్నారు

### సోషల్ మీడియాలో అనుచిత వ్యాఖ్యలతో

# మాజీ ఎమ్మెల్యే రేగా పోస్టులు

### మాజీ ఎమ్మెల్యే రేగాపై భగ్గుమన్న కాంగ్రెస్ పార్టీ



**అశ్వాపురం జూన్ 26 నవభూమి:** అశ్వాపురం మండలం సోషల్ మీడియా లో అనుచిత వ్యాఖ్యలు చేస్తూ పోస్టులు పెడుతున్న పినపాక మాజీ ఎమ్మెల్యే రేగా కాంతారావు పై అశ్వాపురం మండల కాంగ్రెస్ పార్టీ తీవ్రంగా మండి పడుతున్నారు. గురువారం మల్లెలమడుగులో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మండల కాంగ్రెస్ అధ్యక్షుడు ఓరుగంటి బిక్ష్మయ్య మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ పైనా, మా శాసనసభ్యుడిపైన, మా నాయకులపైన చవకబారు పోస్టులుపెడితే సహించేది లేదని హెచ్చరించారు. కాంగ్రెస్ కట్టిన బడిలో చదివి కాంగ్రెస్ హయాంలో ఉద్యోగం పొంది కాంగ్రెస్ ఏం చేసిందని అడగటం విడ్డూరంగా ఉందన్నారు. చదువుకున్న యువకుడివి కదా అని టికెట్ ఇచ్చి ఎమ్మెల్యే గా గెలిపిస్తే పంగనామాలు పెట్టిన చరిత్ర నీది కదా?, కార్యకర్తల రెక్కల కష్టంతో కట్టుకున్న పార్టీ కార్యాలయాన్ని కబ్జా చేసిన ఘనత నీది కదా? అని అడుగుతూ మా శాసన సభ్యుని ఇంటిముందు రోడ్డు గురించి మాట్లాడటానికి సిగ్గుండాలి, ఎన్నికలకి ముందే రోడ్డు నిర్మిస్తుంటే ఎన్నికల కోడ్ అని చెప్పి పనులు ఆపించింది నువ్వు కదా అని ప్రశ్నించారు. నువ్వు దమ్మున్న మొగోడివే కదా మరి పది సంవత్సరాల నీ హయాంలో మనుబోతులపాడు రోడ్డు ఎందుకు వేయించలేకపోయావో తెలపాలన్నారు. ఎన్నికల ముందు హడావుడిగా నువ్వు శిలాఫకాలు వేస్తే నిధులు విడుదల చేయించి పనులు పూర్తి చేసిన ఘనత మా శాసనసభ్యుడిదన్నారు. ప్రజాప్రభుత్వం ఏర్పడి ఏడాదిన్నర కాకముందే పినపాకలో వందలకోట్ల తో అభివృద్ధి పనులకోసం ఖర్చు చేశారన్నారు. నీ చవకబారు పోస్టులు ప్రజలు గమనిస్తున్నారని చెపుతూ 18 నెలల క్రితమే మీ కారు పార్టీకి ప్రజలే పిండం పెట్టారన్న విషయం గుర్తుపెట్టుకోవాలన్నారు. కార్యక్రమంలో మండల కాంగ్రెస్ సీనియర్ నాయకులు గాదె కేశవరెడ్డి, ఓరుగంటి రమేష్ బాబు, తుక్కాని మధుసూదన్ రెడ్డి, బేతం రామకృష్ణ, ఆవుల రవి, కారం శ్రీను, కొండాబత్తుల ఉపేందర్, కొప్పుల శ్రీనివాస్ రెడ్డి, బచ్చు వెంకటరమణ, పద్దం నరసింహారావు, బారాసు సంపత్, చంచల రాము, హర్షా నాయక్, కోలా శశికాంత్, కుంజా జాను తదితరులు పాల్గొన్నారు.

## సామాన్య ప్రజలకు ఇబ్బందులు కలిగించే వ్యక్తులపై కఠిన చర్యలు

### అర్ధరాత్రి ఆకస్మిక తనిఖీలు చేపట్టిన భద్రాచలం ఏఎస్పీ విక్రాంత్ కుమార్ సింగ్





**భద్రాచలం జూన్ 26 నవభూమి ప్రతినిధి:** భద్రాచలం పట్టణ మరియు పరిసర ప్రాంతాల్లో అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వ్యక్తులను ఉపేక్షించేది లేదని భద్రాచలం ఏఎస్పీ విక్రాంత్ కుమార్ సింగ్ ఒక ప్రకటనలో వెల్లడించారు. గంజాయి, మద్యం, డ్రగ్స్ వంటి మత్తు పదార్థాలకు బానిసలై కొంతమంది యువత సామాన్య ప్రజానీకానికి ఇబ్బందులు కలిగించే విధంగా ప్రవర్తిస్తున్నట్లు తమ దృష్టికి వచ్చిందని తెలిపారు. ఇకపై భద్రాచలం పట్టణంలో పోలీసు వారు అనుమానిత ప్రాంతాల్లో, గంజాయి హాట్స్పాట్స్ గా గుర్తించిన ప్రదేశాలలో ఆకస్మిక తనిఖీలు చేపట్టడం జరుగుతుందని తెలిపారు. భద్రాచలం మీదుగా వివిధ ప్రాంతాల నుండి ఎలాంటి నిషేధిత పదార్థాలు తరలి వెళ్లకుండా పగలు,రాత్రి తేడా లేకుండా పోలీసులు వాహన తనిఖీలు చేపట్టడం జరుగుతుందని అన్నారు. భద్రాచలం పట్టణ పరిసర ప్రాంతాల్లో ఎవరైనా ఆకతాయిలు గంజాయి సేవిస్తున్నట్లు గానీ, రవాణా చేస్తున్నట్లుగానే సమాచారం తెలిస్తే వెంటనే పోలీసు వారికీ చామాచారం ఇవ్వాలని కోరారు.

# పెద్దమ్మ తల్లికి ఘనంగా సువర్ణ పుష్పార్చన



**పాల్వంచ టౌన్ జూన్ 26 నవభూమి ప్రతినిధి:** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పాల్వంచ మండలం, కేశవాపురం జగన్నాధపురం గ్రామంలో వెలిసియున్న శ్రీ కనకదుర్గ దేవస్థానం(పెద్దమ్మ గుడి) లో గురువారం పురస్కరించుకొని అమ్మవారికి 108 సువర్ణ పుష్పములతో వైభవంగా సువర్ణ పుష్పార్చన నిర్వహించారు. ఇందులో భాగంగా అమ్మవారికి హారతి, మంత్రపుష్పం, నివేదనతదితర ప్రత్యేక పూజలు అర్చకులచే నిర్వహించారు. అనంతరం భక్తులు అమ్మవారిని దర్శించి తీర్థ ప్రసాదములు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో దేవస్థాన కార్యనిర్వాహణాధికారి ఎన్.రజినీకుమారి, దేవస్థాన పాలకమండలి చైర్మన్ బాలినేని నాగేశ్వరరావు, ధర్మకర్తలు, చీకటి కార్తీక్, అడుసుమిల్లి సాయిబాబా, పెండ్లి రామిరెడ్డి, చెవుగాని పాపారావు, చెరుకూరి శేఖర్ బాబు, ధర్మరాజుల నాగేశ్వరరావు, శనిగారపు శ్రీనివాసరావు దేవస్థాన సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.



ఈనెల 28వ తేదీన ఆలయములో సీల్డ్ కొటేషన్స్

శ్రీ కనకదుర్గ దేవస్థానం ( పెద్దమ్మ గుడి) నందు దేవి శరన్నవరాత్రులు( దసరా) సందర్భంగా వివిధ వస్తువులు సప్ల యి /ఏర్పాట్లు / పనులు చేయుటకు ఫీల్డ్ కొటేషన్లు కోరుచున్నామని దేవస్థాన కార్యనిర్వాహణాధికారి ఎన్. రజినీకుమారి తెలిపారు. ఇతర వివరాలకు ఫోన్ నెంబర్ 6303408458, దేవస్థాన కార్యాలయం లో సంప్రదించగలరని తెలిపారు.

దేవాలయ ఆవరణంలో నూతన గదుల నిర్మాణమునకు ఈ- టెండర్స్ ఆహ్వానం

శ్రీ కనకదుర్గ దేవస్థానం ( పెద్దమ్మ గుడి) నందు నూతనంగా నిర్మాణం కాబడిన షాపింగ్ కాంప్లెక్స్ పై భాగం లో 12 గదుల నిర్మాణమునకు ఆన్ లైన్ లో దరఖాస్తు చేసుకోవాలని దేవస్థాన కార్యనిర్వహణాధికారి ఎన్. రజినీ కుమారి తెలిపారు.

# వెంకటేశ్వరుని హుండీల లెక్కింపు



**ఏర్రుపాలెం,నవభూమి,జూన్ 26 :** తెలంగాణ తిరుపతిగా ప్రసిద్ధిగాంచిన జమలాపురం శ్రీ వెంకటేశ్వర స్వామి వారి ఆలయంలో భక్తులు సమర్పించిన కానుకల హుండీలను గురువారం దేవాదాయ పరిశీలకులు ఎం అనిల్ కుమార్ సమక్షంలో లెక్కించారు.95 రోజులకు గాను 41,23,546 రూపాయలు ఆదాయం వచ్చినట్లు ఈవో కొత్తూరు జగన్ మోహన్ రావు తెలిపారు.ఈ కార్యక్రమంలో ధర్మకర్త ఉప్పల శ్రీరామ చంద్ర మూర్తి,ప్రధానార్చకులు శ్రీనివాస శర్మ,అర్చకులు సిబ్బంది శ్రీ సత్యసాయి సేవా సమితి సభ్యులు పాల్గొన్నారు.

# మణుగూరులో 21.5 కేజీల గంజాయి స్వాధీనం




**మణుగూరు జూన్ 26 నవభూమి ప్రతినిధి:**ఉమ్మడి ఖమ్మం జిల్లా ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ జనార్ధన్ రెడ్డి మరియు అసిస్టెంట్ కమిషనర్ గణేష్ అసిస్టెంట్ ఎక్సైజ్ సూపర్డెంట్ తిరుపతి ఆదేశాల మేరకు ఎన్ఫోర్స్మెంట్ సీఐ రమేష్ మరియు వారి సిబ్బంది మణుగూరు పట్టణ శివారులోని రథంగుట అర్బన్ పార్క్ వద్ద వాహన తనిఖీలు నిర్వహిస్తుండగా టయోటా ఫార్చునర్ కార్ లో ఆరుగురు వ్యక్తులు గంజాయి తరలిస్తుండగా పట్టుకున్నారు. వీరి వద్ద నుండి నాలుగు సెల్ ఫోన్ లను, 21.5 కేజీల ఎండు గంజాయి స్వాధీనం చేసుకున్నారు. హైదరాబాద్ కు చెందిన షేక్ సమీర్, సయ్యద్ అబూబకర్, షేక్ పైసల్ (పరారీ లో ఉన్నాడు), ఖమ్మం జిల్లా కల్లూరు మండలం పేరవంచ గ్రామానికి చెందిన తానంకి ప్రవీణ్, కోట హరీష్, షేక్ యశ్వంత్ కుమార్ లు గంజాయి మత్తుకు అలవాటు పడి, ముఠాగా ఏర్పడి ఒరిస్సాలోని మల్కారిగిని నుండి హైదరాబాదులోని పాతబస్తీకి గంజాయి తరలిస్తూ పట్టుపడ్డారని, పట్టుబడిన గంజాయి విలువ 13 లక్షలు ఉంటుందని సిఐ సుంకర రమేష్ తెలిపారు. వీరిని స్థానిక ఎక్సైజ్ స్టేషన్ మణుగూరుకు తరలించి రిమాండ్కు తరలిస్తున్నారని స్థానిక సీఐ రాజిరెడ్డి తెలిపారు. ఈ తనిఖీలలో కరీం, సుధీర్, వెంకటేష్, హనుమంత్రావు, హరీష్, ఉపేందర్, వీరబాబు పాల్గొన్నారు.

# నాటి ఎమర్జెన్సీని తలపిస్తున్న మోడీ పరిపాలన

## మతతత్వ నయా ఫ్యాసిస్ట్ శక్తుల నుండి ఈ దేశాన్ని కాపాడుకోవాలి



**భద్రాచలం జూన్ 26 నవభూమి ప్రతినిధి:** 1975 సంవత్సరంలో దేశాన్ని పరిపాలిస్తున్న ఇందిరా గాంధీ నిరంకుషత్వంగా ఎమర్జెన్సీ రూపంలో ప్రజాస్వామ్యాన్ని హరించి 50 ఏళ్లు అవుతోందని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎం బి నర్సారెడ్డి, పార్టీ పట్టణ కార్యదర్శి గడ్డం స్వామి లు అన్నారు. సిపిఎం 20వ వార్డు కమిటీ ఆధ్వర్యంలో డి సీతాలక్ష్మి అధ్యక్షతన జరిగిన జనరల్ బాడీ సమావేశంలో వారు ప్రసంగించారు. నాడు నిర్బంధాలతో, నిరంకుశత్వంతో అధికారాన్ని కాపాడుకోగలమని ఇందిరా గాంధీ భావించిందని, కమ్యూనిస్టు నాయకులను ప్రధానంగా సిపిఎం నేతలపై నిర్బంధాన్ని ప్రయోగించి జైల్లో పెట్టి చిత్రహింసలకు గురిచేసిందని అన్నారు. నాడు ప్రజలు ప్రజాస్వామ్యాన్ని కాపాడుకోవడానికి పెద్ద ఎత్తున ఉద్యమించిన ఫలితంగా 77 లో జరిగిన సాధారణ ఎన్నికల్లో ఇందిరా గాంధీ ఘోరమైన ఓటమి చవిచూడాల్సిన పరిస్థితి ఏర్పడిందని అన్నారు. ఆనాడు ఎమర్జెన్సీకి మద్దతు పలికిన ఆర్ఎస్ఎస్, బిజెపి నాయకులు నేడు సంవిధాన్ హత్య దివస్ (రాజ్యాంగ హత్యా దినం) గా జూన్ 25న కార్యక్రమాలు చేపట్టడం విడ్డూరంగా ఉందని విమర్శించారు. వాస్తవానికి మోడీ పాలనలో నేడు మనం చూస్తున్నది ఎమర్జెన్సీ నాటి నిరంకుశత్వపు పోకడలే అని అన్నారు. మోడీ ప్రభుత్వాన్ని ప్రశ్నించిన రచయితలు, జర్నలిస్టులు, విద్యార్థులు, రాజకీయ ప్రత్యర్థులపై ఉపా చట్టం- పేరుతో గొంతు నొక్కుతున్నారని విమర్శించారు. ప్రతిపక్ష నాయకులను భయపెట్టడానికి, ఒత్తిడికి గురి చేయడానికి రాజ్యం చేతిలో ఉన్న సిఐడి,ఈడి తదితర ప్రభుత్వ సంస్థలను ఉపయోగిస్తుందని అన్నారు. ఫెడరలిజాన్ని దెబ్బతీస్తూ రాష్ట్రాల హక్కులను కాల రాస్తుందని, దేశంలో మత ఘర్షణలు సృష్టించి లౌకిక విలువలను దెబ్బతీస్తోందని అన్నారు. నాడు ఇందిరాగాంధీ ఎమర్జెన్సీ ప్రకటించి నిరంకుశంగా పాలిస్తే నేడు నరేంద్ర మోడీ నాయకత్వంలో బిజెపి ప్రభుత్వం ఎమర్జెన్సీని తలపించేలా రాజ్యాంగాన్ని దెబ్బతీస్తూ నిరంకుశంగా పరిపాలన చేస్తుందని ప్రజాస్వామ్య విలువలను తుంగలో తొక్కి మతతత్వ నయా ఫాసిస్టు విధానాలను అమలు చేస్తోందని అన్నారు. నేడు బిజెపి అమలు చేస్తున్న నయా ఫాసిస్టు విధానాలకు వ్యతిరేకంగా ప్రజాస్వామ్యవాదులు, అభ్యుదయవాదులు ఐక్యంగా కదలి రావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పార్టీ శాఖ కార్యదర్శి డి రామకృష్ణ, సభ్యులు రాంబాబు, లక్ష్మీకాంత, రాధా చిట్టెమ్మ, తదితరులు పాల్గొన్నారు.

# ప్రజా సమస్యల పరిష్కారం ఎర్రజెండాతోనే: పోతినేని



**ఎర్రుపాలెం,నవభూమి,జూన్ 26:**ప్రజా సమస్యల పరిష్కారానికి నిరంతరం అండ గాఉండేది ఎర్రజండాఅని ఎర్రజెండాఅండ తోనే సమస్యలుపరిష్కారం అవుతాయని సిపిఎం పార్టీ రాష్ట్రకార్యదర్శివర్గసభ్యులు పోతినేని సుదర్శన్ అన్నారు.ఎరుపాలెం మండల పరిధిలోని మామునూరు గ్రామా నికి చెందిన కామ్రేడ్ రామాలమోక్షానందం ఇటీవలమృతిచెందారు.ఆయనసంస్మరణ సభను సిపిఎం పార్టీ ఆధ్వర్యంలో గురు వారం ఘనంగా నిర్వహించారు.సంస్మరణ సభ ప్రారంభానికి ముందు మండల కార్య దర్శి మద్దాల ప్రభాకరరావుపార్టీ జెండాను ఆవిష్కరించారు. మోక్షానందంకు జోహార్ లు అర్పిస్తూ గ్రామంలో ప్రదర్శన నిర్వ హించారు.డివిజన్ కార్యదర్శి మడిపల్లి గోపాలరావు మోక్షానంద%శీ% చిత్రపటానికి పూలమాలవేసిఘనంగానివాళులర్పించారు.అనంతరం మండలకార్యదర్శి మద్దాల ప్రభాకరరావు అధ్యక్షతన జరిగిన సంస్మ రణసభలో పోతినేని సుదర్శన్ రావు మాట్లాడుతూ ఎన్ని కష్టాలు,ఇబ్బందులు కలిగిన ఎర్రజెండా స్పూర్తి,దృడసంకల్పం తో పార్టీ తీర్చి దిద్దిన గొప్ప వ్యక్తి మోక్షా నందం అని అన్నారు.గ్రామ అబివృద్ధికి ప్రజాసమస్యల పరిష్కారం కోసం నిజా యితీగా రాజీలేకుండా పనిచేశారని,తుది శ్వాస వరకు ఎర్రజెండాను నమ్ముకుని పనిచేసిన వ్యక్తి అన్నారు.మోక్షానంద%శీ% ఈనాడు మన మధ్య లేకపోవటం చాలా బాదాకరమని ఆయన ఆశయాలను కొనసాగిద్దాం అన్నారు.వారికి జోహర్లు అర్పిస్తూ వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతిని తెలిపారు.ఈ కార్యక్రమం లో మాజీ రాష్ట్ర కమిటీ సభ్యులు పొన్నం వెంకటేశ్వరరావు,నాయకులు చింతల చెరువు కోటేశ్వరరావు,కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు వేమిరెడ్డి సుధాకర్ రెడ్డి,మధిర మార్కెట్ చైర్మన్ బండారు నరసింహారావు,పంబి సాంబశివరావు, సిపిఎం పార్టీ జిల్లా కమిటీ సభ్యులు దివ్వెల వీరయ్య,శీలం నరసింహారావు, మందా సైదులు,టౌన్ కార్యదర్శి పడకంటి మురళి,రాధాకృష్ణ,మండల కమిటీ సభ్యులు గొల్లపూడి పెద్ద కోటేశ్వరరావు, షేక్ లాలా,గామాసు జోగయ్య,నాగుల వంచ వెంకటరామయ్య,దూదిగ%శీ% బసవ య్య,నల్లమోతుల హనుమంతరావు, సగుర్తి సంజీవరావు,కూడెల్లి నాగేశ్వర రావు,గవరాజు రాములు,నాగరాజు,షేక్ కరీం,బేతి శ్రీనివాసరావు,స్వామి,సుందర%శీ% కుటుంబసభ్యులుతదితరులుపాల్గొన్నారు.

# అర్హులైన పేదలందరికీ ఇందిరమ్మ ఇళ్లు ఇవ్వాలి



**గార్ల, నవభూమి, జూన్ 26:** అర్హులైన పేదలందరికీ ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయాలని, సీజనల్ వ్యాధులు ప్రబలకుండా గ్రామాల్లో పారిశుద్ధ్య పనులు చేపట్టాలని ఇల్లందు నియోజకవర్గ మాజీ శాసనసభ్యురాలు బానోత్ హరిప్రియ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గార్ల మండల పరిషత్ కార్యాలయం ఎదుట గురువారం బి ఆర్ ఎస్ కార్యకర్తలు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రజా సంక్షేమాన్ని కోరే ప్రభుత్వం మాదని బీరాలు పలుకుతున్న రాష్ట్ర ప్రభుత్వం అర్హులైన పేదలను విస్మరించడం సహేత్వం కాదన్నారు. అనంతరం డిమాండ్లతో కూడిన గణిత పత్రాన్ని ఎంపీడీవో కు అందించారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల కమిటీ అధ్యక్షుడు గంగావత్ లక్ష్మణ్ నాయక్, గార్ల మాజీ ఎంపీటీసీ శీలం శెట్టి రమేష్, మండల మాజీ కో ఆప్షన్ సభ్యుడు ఖదీర్ బాబా, గణేష్, మురళి, తదితరులు పాల్గొన్నారు.

# ఎర్రజెండాలన్నీ ఏకం కావాలి

- వందేళ్ళ చరిత్ర కలిగిన ఏకైక పార్టీ సిపిఐ
- డిసెంబర్ 26న ఖమ్మంలో ఐదు లక్షల మందితో భారీ మహాసభ
- మావోయిస్టులు వనం వీడి జనంలోకి రావాలి
- ఖమ్మం - కొత్తగూడెం కేంద్రంగా ప్రజా ఉద్యమాలు
- సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు
- అట్టహాసంగా సిపిఐ 14వ మండల మహాసభ



**ఖమ్మం రూరల్, నవభూమి, జూన్ 26:** దేశంలోని కమ్యూనిస్టు పార్టీలన్నీ ఏకమై ఢిల్లీలో ఎర్రకోటపై ఎర్ర జెండాను ఎగరవేద్దామని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం శాసనసభ్యులు కూనంనేని సాంబశివరావు అన్నారు. గురువారం ఏదులాపురం మున్సిపాలిటీలోని పెద్ద తండాలో గల రామ్ లీలా ఫంక్షన్ హాల్ లో పోటు ప్రసాద్ ప్రాంగణంలో సిపిఐ 14వ మండల మహాసభను అట్టహాసంగా నిర్వహించారు. తొలుత ప్రాంగణంలో ఏర్పాటు చేసిన అరుణ పతాకాన్ని సిపిఐ రాష్ట్ర కంట్రోల్ కమిషన్ చైర్మన్ మొహమ్మద్ మౌలానా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మేళ్లచెరువు లలిత, మొహమ్మద్ గౌస్ పాషా, లింగా వెంకటనారాయణ, బత్తిని సీతారాములు, జగన్ అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో కూనంనేని మాట్లాడారు. ప్రజలు ఇచ్చిన అధికారంతో అమిత్ షా వీధి రౌడీలా వ్యవహరిస్తున్నారని ధ్వజమెత్తారు. మావోయిస్టులు చర్చలకు వస్తామన్నప్పటికీ మారణకాండ చేస్తుండటం సరికాదన్నారు. అధికారం చేపట్టిన నాటి నుంచి బిజెపి రైతు వ్యతిరేకిగా వ్యవహరిస్తుందని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం తప్పిదంతోనే బిజెపి కల్లు లొట్టబోయి గెలిచి మరలా ప్రజా వ్యతిరేక విధానాలు అవలంబిస్తుందని ఆరోపించారు. ఆపరేషన్ కగార్ కు వ్యతిరేకంగా, మావోయిస్టులకు మద్దతుగా నిలిచింది సిపిఐ పార్టీనే అన్నారు. మావోయిస్టులు వనం వీడి జన ప్రవంతిలోకి రావాలని పిలుపునిచ్చారు. ప్రజలు కూడా అర్థం చేసుకోవాలని కార్పోరేట్ ప్రభుత్వాలను నమ్ముకుంటే మావోయిస్టులను చంపినట్టే ప్రజలను సైతం చంపుతారన్నారు. రాజకీయ మేధావులు, విశ్లేషకులు, ప్రజలు కమ్యూనిస్టు పార్టీ ఆవశ్యకతను గుర్తెరగాలని, చెట్టు లాంటి కమ్యూనిస్టును పెంచుకుందామన్నారు. వందేళ్ళ చరిత్ర కలిగిన ఏకైక పార్టీ సిపిఐ అని, ఖమ్మంలో డిసెంబర్ 26న 5 లక్షల మందితో వేడుకలను నిర్వహించబోతున్నట్లు తెలిపారు. గత బిఆర్ఎస్ ప్రభుత్వం చేసిన తప్పిదాలతో తెలంగాణ విధ్వంసానికి గురైందన్నారు. ఈ నేపథ్యంలోనే ప్రజల ఆగ్రహానికి గురై కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిందన్నారు. ఇప్పటికే ఏడాది పాలన నరకంలా గడిచిందని, కాంగ్రెస్ ప్రభుత్వం ఇక తన సమర్థతను నిలబెట్టుకోవాలన్నారు. ఖమ్మం-భద్రాద్రి కొత్తగూడెం కేంద్రంగా ఇక ప్రజా ఉద్యమాలు నిర్మించబోతున్నట్లు పేర్కొన్నారు. ప్రజా సమస్యలపై పోరాటం చేస్తూ ప్రజా బలాన్ని కూడగట్టేలా కామ్రేడ్స్ పని చేయాలన్నారు. అనంతరం నూతన మండల కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అలాగే పలు తీర్మానాలను ప్రవేశపెట్టుకొని ఆమోదింప చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జాతీయ సమితి సభ్యులు భాగం హేమంతరావు, సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి దండి సురేష్, సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు సిద్ధినేని కర్ణ కుమార్, సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు మిడకంటి చిన్న వెంకటరెడ్డి, అజ్మీరా రామ్మూర్తి, జిల్లా సమితి సభ్యులు పుచ్చకాయల కమలాకర్, ఉన్నం రంగారావు, ఎడ్లపల్లి శంకరయ్య, చెరుకుపల్లి భాస్కర్, బానోతు రామకోటి, పగిళ్ల వీరభద్రం, ఏఐటీయూసీ జిల్లా నాయకులు సింగ్ నరసింహారావు, గాదె లక్ష్మీనారాయణ, సీతామాలక్ష్మి, సిపిఐ మండల కార్యదర్శి పుచ్చకాయల సుధాకర్, మండల సమితి సభ్యులు పసంగుల చందర్రావు, ఏలూరి భాస్కర్, మామిడి శంకర్ రెడ్డి, బట్టా బాబు, మేళ్లచెరువు వీరబాబు, వెన్నం భాస్కర్, యువజన సంఘం సభ్యులు మామిండ్ల శ్రీనాథ్ రెడ్డి, ఉసికల రవికుమార్, గణపారపు ఉపేందర్ తదితరులు పాల్గొన్నారు.

## బూర్గంపాడు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో ఏసీబీ సోదాలు






**కొత్తగూడెం జూన్ 26 నవభూమి ప్రతినిధి:** జిల్లాలో ఏసీబీ దాడుల పరంపర కొనసాగుతుంది ఆకస్మిక తనిఖీలు చేపట్టి అవినీతి అధికారులను హడలెత్తిస్తున్నారు, ఏసీబీ డీఎస్పీ వై.రమేష్. జిల్లా లోని బూర్గంపహడ్ మండలంలోని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో గురువారం ఏసీబీ డీఎస్పీ వై రమేష్ ఆధ్వర్యంలో ఆకస్మిక సోదాలు చేశారు.ఈ సందర్భంగా ఏసిబి డిఎస్పి వై.రమేష్ మాట్లాడుతూ ఈ కార్యాలయం పై అనేక ఫిర్యాదులు వచ్చాయని తనిఖీల్లో అక్రమాలు వెలుగు చూసాయని, ఫోన్ పే పేమెంట్స్, కార్యాలయంలో బయట వ్యక్తులు ఉన్నారని, వీటన్నిటిని ప్రభుత్వానికి నివేదిస్తామని డీఎస్పీ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో ఏసీబీ యాక్టివ్ గా ఉందని ప్రభుత్వ అధికారులు చట్టబద్ధంగా చేయాల్సిన పనిని లంచం అడుగితే తమ టోల్ ఫ్రీ నెంబర్ 1064 కు సంప్రదించాలని ఫిర్యాదిదారుల వివరాలు గోప్యంగా ఉంచుతామని, పని సక్రమం అయితే ఏసీబీ చేయిస్తుందన్నారు.

## విద్యుత్ షాక్ తో సూడి ఆవు మృతి రూ.80వేల నష్టం

**- లబోదిబోమంటున్న బాధిత రైతు కుటుంబీకులు**

**ఆదుకోవాలని దీనంగా ఏకరువు**



**కామేపల్లి,-నవభూమి,జూన్ 26 :** కామేపల్లి మండలం గోవింద్రాల గ్రామంలో విద్యుత్ షాక్ తో సూడి ఆవు గురువా రం మృతి చెందింది.అందుకు సంబంధించిన వివరాలు బాధి త రైతు కుటుంబీకుల కథనం మేరకు ఇలా ఉన్నాయి. లాకావత్ భీముడు ఆవు మేత మేయటానికి సమీపం లోని పంట చేలకు వెళ్ళింది. ఈ క్రమంలో గుగులోత్ హర్జ నర్సరీ వద్ద ఉన్న విద్యుత్ సపోర్ట్ తీగకు విద్యుత్ ప్రవ హిస్తూ ఉండటంతో ఆవు తగిలి అక్కడికి అక్కడే మృతి చెందింది.మృతి చెందిన ఆవు విలువ సుమారు రూ.80 వేలు ఉంటుందని రైతు లకావత్ భీముడు పేర్కొన్నాడు.మృతి చెందిన ఆవు వద్ద భీముడు కుటుంబ సభ్యులు కన్నీరుగా మున్నీరుగా విలపించారు.ఈ విషయం తెలుసుకున్న కొత్త లింగాల విద్యుత్ శాఖ ఏఈ ఎన్.శ్రీనివాసులు సంఘటన స్థలానికి చేరుకొని మృతి చెంది న ఆవును పరిశీలించారు. ఉన్నంత అధికారుల దృష్టికి తీసుకెళ్తానని రైతుకు న్యాయం జరిగేటట్లు చూస్తానని తెలిపా రు.మండల పశు వైద్య అధికా రి డాక్టర్ నాగులు పంచినామా నిర్వహించారు.మృతి చెందిన ఆవును విద్యుత్ శాఖ లైన్ఇ న్స్పెక్టర్ ఆశీర్వాదం,జూనియ ర్ లైన్మెన్ కుమార్,సురేష్,భ ద్రు తదితరులు పరిశీలించా రు.కరెంట్ షాక్ తో సూడి ఆవు మృతి చెందడంతో ప్రభుత్వం పరిహారం అందజేసి ఆదుకో వాలని బాధిత రైతు కుటుంబీ కులు దీనంగా వేడుకుంటు న్నారు.

## కేకే ఇన్ఫ్రా ప్రొప్రైటర్ ఖలీల్‌కు సతివియోగం

**నివాళులర్పించిన సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెంశాసనసభ్యులు కూనంనేని సాంబశివరావు**



**ఖమ్మం రూరల్, నవభూమి, జూన్ 26:** ఖమ్మం రూరల్ మండలం ఏదులాపురం మున్సిపాలిటీ పరిధిలోని వరంగల్ క్రాస్ రోడ్డుకు చెందిన కేకే ఇన్ఫ్రా ప్రొప్రైటర్ నన్నే సాహెబ్ చారిటబుల్ ట్రస్ట్ నిర్వాహకుడు షేక్ ఖలీల్ కు సతివియోగం జరిగింది. ఆయన భార్య షేక్ సోఫియా (45) గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతూ హైదరాబాదులో చికిత్స పొందుతూ బుధవారం తుది శ్వాస విడిచింది. గురువారం మరణ వార్త తెలుసుకున్న సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం శాసనసభ్యులు కూనంనేని సాంబశివరావు శ్రీరామ్ నగర్ లోని వారి నివాసం వద్దకు వెళ్లి మృతదేహాన్ని సందర్శించి నివాళులు అర్పించారు. అలాగే ఖలీల్ ను ఓదార్చి కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతిని వ్యక్త పరిచారు. మృతురాలికి కుమారుడు ఉన్నాడు. సిపిఐ రాష్ట్ర కంట్రోల్ కమిషన్ చైర్మన్ మొహమ్మద్ మౌలానా, సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి దండి సురేష్, సిపిఐ మండల కార్యదర్శి పుచ్చకాయల సుధాకర్, నాయకులు దండి రంగారావు తదితరులు నివాళులర్పించారు.

## ముగిసిన కిషన్ నాయక్ అంతక్రియలు

**పార్థివ దేహాన్ని మోసిన వైరా ఎమ్మెల్యే రాందాస్ నాయక్**







**కొత్తగూడెం జూన్ 26 నవభూమి ప్రతినిధి:** బిజెపి రాష్ట్ర మహిళా మోర్చా ఉపాధ్యక్షురాలు బానోతు విజయలక్ష్మి, భర్త మాజీ కాంగ్రెస్ నేత బానోతు కిషన్ నాయక్ గుండెపోటుతో బుధవారం మృతి చెందిన విషయం విదితమే. ఆయన అంతక్రియలు కిషన్ నాయక్ స్వగ్రామం పాల్వంచ పాండురంగాపురంలో గురువారం నిర్వహించారు. కిషన్ నాయక్ పార్థివదేహానికి వైరా ఎమ్మెల్యే రాందాస్ నాయక్, బీజేపీ జిల్లా అధ్యక్షులు బైరెడ్డి ప్రభాకర్ రెడ్డి, మాజీ బిజెపి జిల్లా అధ్యక్షుడు రంగా కిరణ్, కాంగ్రెస్ నేత కోనేరు సత్యనారాయణ ( చిన్ని), మాజీ మార్కెట్ చైర్మన్ కొత్వాల శ్రీనివాస్, కాంగ్రెస్ నాయకులు నూకల రంగారావు, కొత్తగూడెం కాంగ్రెస్ నాయకులు, మాజీ కౌన్సిల్లర్లు కాసుల వెంకట్, ఎంఏ. రజాక్, పౌల్, డాక్టర్ శంకర్ నాయక్, డాక్టర్ బి ఎస్ రావు, వాసం రామకృష్ణ దొర, డాక్టర్ మద్దెల శివకుమార్, గుగులోత్ కృష్ణ.. నివాళులర్పించారు. అంతిమయాత్రలో పట్టణ ప్రముఖులు, వైద్యులు, గ్రామ ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. వైరా ఎమ్మెల్యే రాందాస్ నాయక్ పాడి మోసారు. బిజెపి రాష్ట్ర నేతలు విజయలక్ష్మి ని ఫోన్లో పరామర్శించారు.